క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



మేకల రాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : ధర్మాజీగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకల రాజు మాతృమూర్తి నాగేశ్వరమ్మ(80) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఎమ్మెల్యే ఎలీజా సోమవారం నాగేశ్వరమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మేకల రాజు, సతీమణి ఎంపీటీసీ మేకల రాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మందలపు నరసింహారావు, గారపాటి రాంబాబు, మందలపు వేణు, నూతలపాటి శ్రీను, వలీ పరామర్శించిన వారిలో ఉన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



తాగునీటికి బోర్ వెల్ పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కడిమి రమేష్

కామవరపు కోట : జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పథకంలో భాగంగా తడికలపూడి గ్రామ పంచాయతీ పాపయ్యపాలెంలో నూతన బోర్ వెల్ ఏర్పాటు పనులను సోమవారం జెడ్పీటీసీ కడిమి రమేష్ ప్రారంభించారు. రూ.8.50 లక్షల నిధులతో మోటర్ పైపులు, బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా కృషి చేస్తానని అన్నారు. సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీలు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, నాగేంద్ర, వార్డ్ మెంబర్ సుమన్, బోట్ల రఘు, కొండపల్లి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఉచిత న్యాయ సహాయం

జంగారెడ్డిగూడెం : ప్రపంచం కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. డిపో మేనేజర్ గంగాధరరావు అధ్యక్షత వహించగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు అవసరమైన న్యాయ సహాయం ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శి విత్తనాల రత్నరాజు, మహిళా కార్యదర్శి లతాకుమారి, న్యాయవాదులు మేకల రామమోహనరావు, పీవీ కృష్ణారెడ్డి, పిల్లి పెద్దిరాజు, బల్లె సాయికుమారి, తొర్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు

కుకునూరు : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు కుకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి ఆదేశాల మేరకు మే 1 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తారని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాడువాయి హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం రూరల్ : తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు జి.సత్యవతి, బంగారు బ్రహ్మం, కుటుంబరావులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ వీరమల్ల ధనరాజు, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ కార్యదర్శి కనికళ్ల ప్రసాద్‌బాబు, చిట్లూరి రవిప్రసాద్, నున్నా నాగ చంద్రరావు, పసల రాజశేఖర్, చీమల నాగేంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణం

కొయ్యలగూడెం: గవరవరంలో సోమవారం రాత్రి శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. పలువురు భక్త దంపతులు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని ఆచరించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం, మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం



జంగారెడ్డిగూడెంలో నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు



ధర్మాజీగూడెంలో పతాకావిష్కరణ చేసిన కార్మికులు



పోలవరంలో నినదిస్తున్న సీఐటీయూ నాయకులు



దిప్పకాయలపాడులో మే డే నిర్వహిస్తున్న కార్మిక సోదరులు

- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- వాడవాడలా రెపరెపలాడిన అరుణ పతాకం

జంగారెడ్డిగూడెం : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అరుణ పతాకం రెపరెపలాడింది. కార్మిక నాయకులు జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాలని, అందుకోసం కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని కార్మిక లోకం పిలుపునిచ్చింది. జంగారెడ్డిగూడెం మండలం సీపీఎం కార్యాలయం వద్ద ప్రపంచ కార్మిక దినోత్సవం జెండా ఆవిష్కరించారు. ఆ పార్టీ నాయకులు ఎస్‌కే సుభాషిని, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి బడా పెట్టుబడిదారీ, కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులంతా ఏకమై కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి.సూర్య కిరణ్, ఏ.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో సోమవారం మేడేను నిర్వహించారు. తాపీ మేస్త్రీల యూనియన్ ప్రెసిడెంట్ కొప్పుశెట్టి సూరిబాబు జెండాను ఎగురవేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మామిడి రామ్‌గోపాల్, నాయకులు మంగిన దుర్గారావు కండిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎం.పాండురంగారావు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షులు కొత్తూరి నాగేశ్వరరావు, సంత మార్కెట్ వద్ద కె.విగ్నేష్, మొగళ్లపు వీరన్న స్థూపం వద్ద కుంచె వసంతరావు, ఇంద్రజిత్ గుప్తా నగర్‌లో పెద అప్పలరాజు, గరుడపక్షి నగర్‌లో చిలంతరాజుల శ్రీను, ఏరియా ఆసుపత్రి వద్ద జుజ్జవరపు దుర్గారావు కార్మిక జెండాను ఎగురవేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీరమణ పాల్గొని జెండాను ఎగురవేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఈభూషణం, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రాణి రత్నప్రభ పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : కార్మికుల కష్టం లేనిదే ఈ ప్రపంచం ఒక్క అడుగు కూడా అభివృద్ధిలో ముందుకు పోలేదని, అభివృద్ధిలో కార్మికులను భాగస్వాములు చేసినప్పుడే అది నిజమైన అభివృద్ధి సాధ్యమని లక్కవరం శ్రీమద్ది ఆంజనేయ తాపీ యూనియన్ సభ్యులు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం వేడుకలను లక్కవరంలో సోమవారం నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ కిషోర్ మాట్లాడుతూ కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వాలు స్పందించి వారి కుటుంబాలకు న్యాయం చేసేలా కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పని ఒత్తిడి నుంచి కాపాడిన జెండా

పోలవరం రూరల్ : పోలవరంలో ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పోలవరం మండల కేంద్రంలో సీఐటీయూ, సీపీఎం పార్టీ సంఘాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ముందు అరుణపతాకావిష్కరణ చేశారు. సీఐటీయూ పోలవరం మండల కార్యదర్శి పీఎల్‌ఎస్ కుమారి, గౌరవాధ్యక్షులు బంగారు కృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మికులను పని ఒత్తిడి నుంచి కాపాడిన జెండా ఎర్రజెండా అని, ఎర్రజెండా నీడలో కార్మికుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను, నేటి బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను ఏర్పాటు చేసిందన్నారు చట్టాలను కాపాడుకోవడానికి కార్మికులు ఉద్యమించాలన్నారు. బలగం భూచంద్రం, గిరిజన సంఘం సీఐటీయూ నాయకులు తంబరాడ పోసి, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు

12 గంటల పని విధానం మనకొద్దు

టి.నరసాపురం : మేడే సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో బంధంచర్లలో గుడుమూరి పాపారావు, మక్కినవారిగూడెంలో మల్లెల సత్యనారాయణ, గంగినీడుపాలెంలో భవననిర్మాణ కార్మికులు అరుణ పతాకాలను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు బీఎస్ సాగర్, వీరంకి వెంకటరావు, గుడుమూరి పాపారావు, కొండముచ్చు శ్రీనివాసరావు, కాళహస్తి సుబ్బారావు, మట్టా రామారావు, పాలగాని సత్యనారాయణ, బైగాని ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను పొందడానికి మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం 12 గంటల పని విధానం తీసుకొస్తూ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, కార్మికులు కర్షకులు ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళి, మడకం సుధారాణి, పునెం చిన్న సూర్యారావు, మడకం కుమారి, సరియం దుర్గమ్మ, లక్ష్మి పాల్గొన్నారు

పోరాటాల ఫలం.. 8 గంటల పనిదినం

కొయ్యలగూడెం : మండలంలో సోమవారం మేడే ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెంలో సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, వెలగల రామారావు, మట్టా రామకృష్ణ, ఎస్.గిరి, వెలగల నాని, స్వాగత్ టైలర్ ఖాసిం, పాల్గొన్నారు. సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద పతాకావిష్కరణ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఎనిమిది గంటల పని దినాలు హక్కును సాధించుకున్నామన్నారు. ఎస్‌ఎస్ శివకుమార్, ఇళ్ళా తమ్మారావు, సింగం శెట్టి శ్రీను, ఆటోరంగం, ఈ రాఘవులు, మారిసె అప్పారావు, మారిన పేర్రాజు పాల్గొన్నారు.

పోరుబాట పడదాం

కామవరపుకోట: మండలంలో మేడే ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు అధ్యక్షతన కొత్తూరులో ముఠా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి బుచ్చిబాబు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి దేశవ్యాప్తంగా కార్మిక శక్తి ఐక్యమై సాధించుకున్న చట్టాలను కాపాడుకోవడం కోసం తిరిగి మళ్లీ కార్మికులందరూ పోరుబాటలో నడవాలన్నారు. హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు, ముఠావర్కర్ సీనియర్ కార్యదర్శి కోటిగంటి సోమరాజు, అమృతలూరు సాగరాజు, కంకిపాటి వెంకటరాజు, యన్న భీమయ్య, నల్లమోతుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి

లింగపాలెం : మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెం తోచలకరాయుడుపాలెం గ్రామాల్లో సోమవారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం, సివిల్ సప్లయ్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. జిల్లానాయకుడు పి.రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు కలసికట్టుగా ఉద్యమించాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు బీజెన్ కుమారి, షరీఫ్, ఈశ్వరి, రజని, రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి దాసు, సివిల్ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మికుల ర్యాలీ

కుక్కునూరు : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎం ఎల్ ప్రజా పందా తదితర అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి జెండాను ఎగరవేశారు.

అమర వీరుల త్యాగ ఫలాన్ని కాపాడుకోవాలి

ద్వారకాతిరుమల : కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఉద్యోగులు, కార్మికులు ఐక్యపోరాటాలు చేయాలని రైతు సంఘ నేత కట్టా భాస్కరరావు పిలుపునిచ్చారు. ద్వారకాతిరుమలలో మేడే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో కార్మికులు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ అమర వీరుల త్యాగాల ఫలితంగా లభించిన కార్మిక చట్టాలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

రాస్తారోకోను జయప్రదం చేయాలి



చింతలపూడిలో సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో మేడే పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

చింతలపూడి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 3న తలపెట్టినే రాష్ట్రవ్యాప్త రాస్తారోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. చింతలపూడి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మేడే ఉత్సవాలను వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మేడే సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని జెండా స్థూపాల వద్ద పతాకావిష్కరణ జరిపారు. సీపీఐ కార్యాలయం వద్ద మండల కార్యదర్శి కె గురవయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోడ వజ్రం, కౌలు రైతు సంఘం కార్యదర్శి దొంతా కృష్ణ, అంజమ్మ, ఇస్తరాకుల వెంకటేశ్వరరావు, పట్నాల రామిరెడ్డి పాల్గొన్నారు. కోర్టు పరిధిలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.ఇమ్మానియేలు పతాకావిష్కరణ చేశారు. న్యాయవాదులు పి.డేవిడ్‌రాజు, ఉమర్ ఫారూక్, లోక్‌దాలత్ సభ్యులు ఎండీ అక్బర్ ఆలి పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌డీ జప్రుల్లా జెండాలను ఆవిష్కరించారు.



కామవరపుకోటలో మేడేలో పాల్గొన్న ముఠా యూనియన్ సభ్యులు



లక్కవరంలో కార్మిక సంఘాల ర్యాలీ



ద్వారకాతిరుమలలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్మికులు



కుక్కునూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఎగురవేస్తున్న దృశ్యం

అకాల వర్షంతో అన్నదాత కుదేలు



గవరవరంలో తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి

కొయ్యలగూడెం : అకాల వర్షంతో అన్నదాత కుదేలయ్యాడు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో విరుచుకుపడ్డ గాలివానకు రైతులు తమ పంటను జాగ్రత్త చేసుకునే లోపే నష్టం వాటిల్లింది. గంటన్నర పాటు విరుచుకుపడ్డ భారీ వర్షానికి సుమారు 60 ఎకరాలలో 180 టన్నుల మొక్కజొన్నకి నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు తెలిపారు. మండలంలో 4,500 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తుండగా అందులో ఇప్పటివరకు 2019 ఎకరాలలో మొక్కజొన్న విరవడం పూర్తయిందని అయితే ఆరబెట్టుకుంటున్న సమయంలో వచ్చిన వర్షానికి రైతులకు నష్టం కలిగిందన్నారు. మరో మూడు రోజులు అకాల వర్షం సూచన ఉన్న నేపథ్యంలో కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు చేశారు. తడిసిన మొక్కజొన్నను ఆరబెట్టుకోవాలని అందుకు మార్కెట్ యార్డులోని భవనాలను లేదా గాలి ఎండ ధారాళంగా వచ్చే బహిరంగ ప్రదేశాలను ఉపయోగించుకోవాలన్నారు. మొలకరాకుండా 5 శాతం గళ్ల ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలని సూచించారు. పంట నష్టం అంచనా వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



వర్షానికి కూలిన ఎస్సీ కార్పొరేషన్ భవనం గోడలు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురిసింది. ఎండలు దంచికొడుతున్న సమయంలో కురిసిన వర్షాలతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని గిరిజన ప్రాంతం చల్లబడింది. భారీ వర్షానికి బుట్టాయగూడెంలో నిర్మించిన ఎస్సీ కార్పొరేషన్ బిల్డింగ్ గోడలు కూలిపోయాయి. అలాగే ఇడ్లీల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కురిల్ల రాజేశ్వరికి చెందిన తాటాకుపాక కూలిపోయింది. బూసరాజుపల్లి సమీపంలో వేరుశనగ పంట పూర్తిగా తడిసింది.

బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తమ పేరుమీద భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కొంతమంది వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని జంగారెడ్డిగూడెంకు చెందిన చిన్నం సాయిబాబారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న సాయిబాబారెడ్డికి సర్వే నెంబర్ 575/7లో 71 సెంట్ల భూమి ఉంది. సదరు భూమిని కరుటూరి బాల స్వామి, మిధున్ వారి పేరున రిజిస్టర్ చేయాలని బెదిరించడంతోపాటు పొలంలోకి ప్రవేశించి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారని, అంతేకాక తనను చంపుతామని ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని సాయిబాబరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మహిళను కొట్టిన నేరంపై...

జంగారెడ్డిగూడెం రూరల్ : మహిళను కొట్టిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం టెక్కినవారిగూడెం గ్రామానికి బసవా దుర్గ, అదే గ్రామానికి చెందిన బసవ బసవరాజు మధ్య డబ్బుల విషయంలో వివాదం తలెత్తింది. దీంతో తనను దుర్భాషలాడుతూ కొట్టినట్లు దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బసవరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం

లింగపాలెం : ధర్మాజీగూడెంలో పురుషోత్తం అనే వ్యక్తి ఇంటిలో నిల్వ ఉన్న రేషన్ బియ్యంను విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. 1,200 కేజీల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై నాగరాజు తెలిపారు. ఈబియ్యంను చింతలపూడి సివిల్ సప్లయ్ డీటీ జరీనా, వీఆర్‌వోలకు విజిలెన్స్ అధికారులు అప్పగించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి



రేచర్లలో సంక్షేమ లబ్ధి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు చూపిస్తున్న ఆదరణ మర్చిపోలేనని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని రేచర్ల గ్రామంలో సర్పంచ్ కె శివరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అమ్మ ఒడి, చేయూత, వైఎస్సార్ రైతు భరోసా, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వివిధ వర్గాల ప్రజలను ఎమ్మెల్యే ఎలీజా అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగానే అందుతున్నాయని, గ్రామంలో రహదారులు బాగాలేవని గ్రామస్తులు ఎమ్మెల్యే ఎలీజా దృష్టికి తీసుకురాగా రహదారులను కూడా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఝాన్సీరాణి, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బాలకృష్ణ, పార్టీ నాయకులు తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, మాగంటి లక్ష్మణ్‌దాస్, నరుకుళ్ళ సుబ్బారావు, గుత్తా మాధవరావు, పెనుగొండ శివరామకృష్ణ, కాన్వెంట్ రాజు, అడపా సురేష్, ఎస్.వరలక్ష్మి, అలవాల బాబు, యడ్ల మోహన్‌రావు, ఎం.ఇమ్మానియేలు, ఎస్.కాంతారావు, ఎం.దిలీప్, వెంపా కృష్ణ, ఎస్ దుర్గారావు, పార్టీ నాయకులు తుల్లిమెల్లి చిన్న కుటుంబరావు, జంగా చెన్నకేశవ రెడ్డి, జగ్గవరపు శ్రీహరిరెడ్డి, మందలపు సాయిబాబు, ప్రకాష్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆడమిల్లిలో గడపగడపకు

కామవరపుకోట : ఆడమిల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా హాజరవుతారని, మండలంలోని పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కోర్టు తీర్పుపై కాపు సంఘాల హర్షం

కొయ్యలగూడెం : తుని రైలు దహనం కేసుకు సంబంధించిన కేసును విజయవాడ రైల్వే కోర్టు కొట్టి వేయడంపై కాపు సంఘాలు సోమవారం పలు ప్రకటనలలో హర్షం వ్యక్తం చేశాయి. కొయ్యలగూడెం మండల, పట్టణ కాపు సేవా సంఘాలు, కాపు సంక్షేమ సేన సంఘం స్పందిస్తూ 2016 తునిలో జరిగిన దుర్ఘటనకు బాధ్యులను చేస్తూ కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, దాడిశెట్టి రాజా, సినీ నటుడు జీవిలతో సహా 41 మందిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. విచారణ సమయంలో రైల్వే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, రైలు దహనం కేసులో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం మాని కేసుతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులను చేర్చడంపై ధర్మాసనం ఆక్షేపించిందన్నారు. ఇప్పటికైనా మచ్చలేని విధంగా తమ నాయకులను కోర్టు గుర్తించడం సంతృప్తినిచ్చినట్లు పేర్కొన్నారు.

4న ఉద్యోగ పింఛన్‌దారులకు ఈ-కేవైసీ

కామవరపుకోట : మండలంలోని ప్రభుత్వ ఉద్యోగ పింఛనుదారులు ఈ-కేవైసీ కోసం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీవో కె.శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ ట్రెజరీ అధికారి చింతలపూడి వారి ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీ గురువారం ఉదయం 10.30 నుంచి ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్‌దారులకు చింతలపూడి ట్రెజరరీ సిబ్బంది ఈ-కేవైసీ చేస్తారని, కావున మండలంలోని ప్రభుత్వ ఉద్యోగ, పింఛన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్

9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)

Office mail : tpgadvt@gmail.com